మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌రెడ్డి

పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజమే పోలీసుల లక్ష్యమని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ ప్రవీణ్‌రెడ్డి , ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం తీరికలేని జీవితంలో తమ పిల్లలు ఏం చేస్తున్నారు ?ఎక్కడ తిరుగుతున్నారనే విషయాలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపడం లేదని, దీంతో కొన్ని మాధ్యమాల ద్వారా పిల్లలు మత్తుకు బానిసలు అవుతున్నారని, పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ ,విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

రెయిన్‌బో విస్టాస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేసిన మధుసూదన్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువుల్లో కాలుష్యం పెరిగిపోయి దోమలతో ఇబ్బందిపడుతున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రెయిన్‌బో విస్టాస్ అధ్యక్షులు బండి మధుసూదన్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముల్లకత్వ చెరువులు కలుషితమయ్యాయని, గుర్రపుడెక్కతో దోమలు ప్రబలాయని తెలిపారు. ఈ చెరువుల చుట్టు పక్కల దాదాపు 10 వేల పైచిలుకు జనాభా కలిగిన రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్, 1,290 కుటుంబాలు 4 వేల పై చిలుకు జనాభా, రెయిన్‌బో విస్టాస్ ఫేజ్ 1లో 450 కుటుంబాలు దాదాపు 2 వేల మంది జనాభా, చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్ర నగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సఫ్దర్‌నగర్, ఆంజనేయనగర్, గాయత్రినగర్ కాలనీలవాసులు దోమల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అదే విధంగా కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణకు నోచుకోక ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రామిడి ప్రమోద్‌రెడ్డి, టి. రామ్‌కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జోనల్ కమిషనర్‌కు పూలమొక్క అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను కమిషనర్ కు వివరించారు. డివిజన్‌లో జనాభా ఎక్కువ అని, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో జోనల్ కమిషనర్ త్వరలో పటాన్‌చెరు డివిజన్‌లో పర్యటిస్తానని చెప్పారని కార్పొరేటర్ తెలిపారు.

తారానగర్‌లో డీసీ పర్యటన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. సర్కిల్ పరిధిలోని తారానగర్, లింగంపల్లిలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా రోడ్ల అంచుల్లో ఉన్న మట్టిని తొలగించాలని సూచించారు. తారానగర్ ప్రధాన రోడ్డుపై కట్టెల మండీ ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. దీంతో శానిటేషన్ సిబ్బంది అన్నింటిని తొలగించారు.



మట్టిని తొలగించాలని సిబ్బందికి సూచిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోండి

సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. బుధవారం అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులైన వారు ఈ హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. ప్రతిరోజు హెల్ప్‌డెస్క్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దళారులను నమ్మవద్దన్నారు. నమోదు కోసం డబ్బులు అడిగితే కౌంటర్‌లోని అధికారికి లేదా సర్కిల్ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

మూసీ నదిని పరిరక్షించండి

మణికొండ: గండిపేట చెరువు నుంచి నార్సింగి మీదుగా ఉన్న మూసీ నదిలో మట్టి పోసి నిర్మాణాలు చేపడుతూ దాని ఉనికికి ప్రమాదం కలిగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి డి. కిరణ్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మూసీ నది ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నది ప్రాంతాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలతో రాబోయే రోజుల్లో స్థానిక గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నార్సింగి మాజీ వార్డు సభ్యులు వినోద్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా లింకు రోడ్డు పనులు

చందానగర్ రైల్వే ట్రాక్ వరకు పనులు పూర్తి



చందానగర్ రైల్వే ట్రాక్ వద్ద నిలిచిపోయిన లింక్ రోడ్డు పనులు

- అక్కడి నుంచి అభ్యంతరాలతో అడ్డంకులు
- ఫ్లైఓవర్‌కు అనుమతి వచ్చినా ప్రారంభం కాని పనులు

హఫీజ్‌పేట్: సంవత్సరాలు గడుస్తున్నా లింకు రోడ్డు పూర్తి కాకపోవడంపై ఎప్పటికి పూర్తి చేస్తారంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ముంబై జాతీయ రహదారి, మైహోమ్ జువెల్, చందానగర్ రైల్వే స్టేషన్ ట్రాక్ మీద నుంచి ఆర్టీసీ కాలనీ, శేరిలింగంపల్లి సర్కిల్- 20 కార్యాలయం వరకు హెచ్‌ఆర్‌డీసీ ప్రాజెక్టు కింద రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో చందానగర్ రైల్వే ట్రాక్ వరకు పనులు పూర్తి చేశారు. కాగా చందానగర్ రైల్వే ట్రాక్ మీదుగా ఆర్టీసీ కాలనీ ముంబాయి జాతీయ రహదారి వద్ద ఉన్న జీఎస్ఎం మాల్ వరకు పనులకు ఆటంకం ఏర్పడింది. పలు కాలనీలవాసులు లింకు రోడ్డు వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా సమస్య అలాగే ఉంది.

- ఆర్టీసీ కాలనీ నుంచి ముంబై జాతీయ రహదారి లింక్ రోడ్డు పూర్తి అయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్.
- చందానగర్, మియాపూర్, మదీనాగూడ ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్‌తో పాటు దూరం , సమయం ఆదా అవుతుంది.
- రైల్వే అధికారుల నుంచి ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతులు వచ్చినా పనులు ప్రారంభించలేదు.
- ఆర్టీసీ కాలనీవాసుల అభ్యంతరం తొలిగితేనే ఫ్లైఓవర్ పనులు మొదలుపెడతారని సమాచారం.

వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి



చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న లింక్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి. మియాపూర్, మదీనాగూడ ప్రాంతాల నుంచి గచ్చిబౌలికి వెళ్ళే వారికి దూరం తగ్గడంతో పాటు కంపెనీలకు చేరుకోవడం సులువుగా ఉంటుంది. -చారి, వాహనదారుడు

ఫ్లైఓవర్‌కు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తాం. -ఎమ్మెల్యే గాంధీ





ఆర్టీసీ కాలనీ -ముంబై జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతం

పాఠశాలలో ఫ్యాన్లు, లైట్లు మరమ్మతులు



నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు బాగు చేయిస్తున్న కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు కొత్తపల్లి సంజీవరెడ్డి ఫ్యాన్లు, లైట్లుకు బుధవారం మరమ్మతులు చేయించారు.బుధవారం ఎలక్ట్రీషియన్‌ను తీసుకెళ్లి పాఠశాలలో ఉన్న 9 ఫ్యాన్లు, లైట్లు బాగు చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

ధర్నాను జయప్రదం చేయండి

మియాపూర్: దేశవ్యాప్తంగా జులై 1న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను,చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర కమిటి పిలుపులో భాగంగా జరిగే ధర్నాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు.

అన్నదానం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జున స్వామి ఆలయంలో వర్తక సంఘం ప్రతినిధులు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ యువజన నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అర్చకులు రవి, ఆలయ కమిటీ సభ్యులు యాదిరెడ్డి, కృష్ణ, దిగంబర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యంగా లింకు రోడ్డు నిర్మాణం



ఖాజాగూడ- రాయదుర్గం లింకు రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: లింకురోడ్డు పనులను చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ ప్రధాన రహదారి నుంచి రాయదుర్గం వరకు చిత్రపురికాలనీ మీదుగా నూతనంగా చేపట్టబోయే 120 ఫీట్ల లింకురోడ్డు ఏరియాను ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన తరహాలో లింకు రోడ్డు నిర్మాణం జరుగుతుందని దీని ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగదని, అందరికీ సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ గణపతి, టీపీఎస్ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు రామరాజు, సాయి వైభవ్ కాలనీ అధ్యక్షురాలు పద్మావతి, సుజిత్, సత్యనారాయణ, శ్రీనివాస్, అశోక్, రాజు, సరస్వతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

చిట్కుల్ పెద్ద చెరువులో చేపలు మృతి



పెద్ద చెరువులో మృతిచెందిన చేపలు

పటాన్‌చెరు టౌన్: పెద్ద చెరువులో భారీగా చేపలు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధి పెద్ద చెరువులో చేపలు చనిపోయి పైకి తేలాయి. సమాచారం తెలుసుకున్న పీసీబీ అధికారి గీత, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి చెరువు వద్దకు చేరుకొని పరిశీలించారు. పీసీబీ అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. చుట్టుపక్కల పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్య జలాలు లేవని పీసీబీ అధికారులు అన్నారు. చేపలకు ఆక్సిజన్ తక్కువగా ఉండటం మత్స్యశాఖ అధికారులు చెరువులో మంగళవారం సాయంత్రం లిక్విడ్ కలిపారని బాధితులు చెబుతున్నారు. పీసీబీ అధికారుల నుంచి వచ్చే నివేదికను బట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా చిట్కుల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ... సుమారు 100 కుటుంబాలు చెరువుపై ఆధారపడి జీవిస్తున్నారని ,ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

మత్స్యకారులను ఆదుకుంటాం..

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

చిట్కుల్ పెద్ద చెరువులో పెద్ద ఎత్తున చేపలు మృతి చెందాయని గ్రామస్తులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మత్స్యకారులకు సాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

నిరసన కొనసాగిస్తాం..

హెచ్‌సీయూ విద్యార్థులు



గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2023–24 అధ్యక్షుడు ఎండీ అతీక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి దీపక్‌ఆర్య డిమాండ్ చేశారు. బుధవారం హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సస్పెన్షన్, కేసులను ఎత్తివేయకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే సుకూన్ నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరారు .అధికారులు నియంతృత్వ వైఖరిని విడనాడాలని సూచించారు .డిమాండ్లు నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో మరో నలుగురు రిమాండ్

మియాపూర్: మియాపూర్‌లోని 100, 101 సర్వేనంబర్ హెచ్‌ఎండీఏ భూమి వివాదంలో ఆందోళన చేసి పోలీసులపై రాళ్ల విసిరిన ఘటనలో మరో నలుగురిని మియాపూర్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూమిలో ఇళ్లస్థలాలు ఇస్తున్నారని రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పలువురు వచ్చి గుడిసెలు వేసి ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో అడ్డుకున్న పోలీసులపై ఆందోళన చేసి రాళ్ల దాడికి పాల్పడిన నిందితుల్లో పత్లావత్ వాల్యానాయక్, నేనావత్ నరేష్, ఎం. ఈశ్వర్‌రావు, ఒల్లెపు నగేష్‌లను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో...
సరికొత్త బోధనకు శ్రీకారం

- ఆటపాటలు, కథలతో బోధన
- అమలులోకి పూర్వ ప్రాథమిక విద్య



అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన పుస్తకాలు

బంజారాహిల్స్: అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్య రక్షణ, మెరుగైన కథలతో కూడిన విద్యను అందించడం, గ్రహణశక్తిని పెంచడం లక్ష్యంగా పూర్వ ప్రాథమిక విద్య నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది చక్కటి ప్రణాళికతో మరింత పకడ్బందీగా చిత్రాలతో కూడిన పుస్తకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈసారి నూతన జాతీయ విద్యా విధానంలో 3–6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య తప్పనిసరిగా బోధించాలనే నిబంధన విధించారు.

- ఇందులో భాగంగానే కొత్త తరహా పాఠ్య పుస్తకాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. వీటి ద్వారా బోధన ఎలా చేయాలనే దానిపై ఇప్పటికే హైదరాబాద్ జిల్లా నుంచి కొందరు సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు.
- సోమవారం నుంచి ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ ప్రారంభమైంది.

ప్రియదర్శినితో..

పిల్లల సంఖ్యకు అనుగుణంగా రెండు రకాల పుస్తకాలు సరఫరా చేశారు. 'ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళిక-2024' పుస్తకంలో పిల్లల అవసరాలకు తగ్గట్లుగా, తరువాత నేర్చుకునే చదువుకు అనుగుణంగా ఈ పుస్తకాలను తీర్చిదిద్దారు. ఆట, పాట, ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా టీచర్లు బోధన చేయాల్సి ఉంటుంది. మూడు రోజుల పాటు ఈ బోధన విధానంపైనే శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 9 పాఠ్యాంశాలను 43 వారాల ప్రణాళికలుగా రూపొందించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లకు సహాయకారిగా ఉండేందుకు 'పూర్వ ప్రాథమిక విద్యా దీపిక'ను కూడా అందించారు. ఇందులో ఎలా ఉండాలి, ఎందుకు, ఏమిటి వంటి అంశాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ విధానం వల్ల పిల్లల్లో గ్రహణశక్తి పెరుగుతుందని వారు పేర్కొన్నారు.

సమాచారం

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

చందానగర్ ఏడీఈ శ్యాంరావు :	8332872962
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఇంద్రసేనారెడ్డి :	8985564147
చందానగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేందర్ :	9440813167
వేమన కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి :	8985564919
తారానగర్ సబ్‌స్టేషన్ ఏఈ సుమన్ :	9440156725
ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7 :	9490153510

జీహెచ్‌ఎంసీ సర్కిల్ 21 శానిటేషన్ విభాగం..

ఏఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్ :	9154295227
శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ :	8008103629
మాదాపూర్ డివిజన్ ఎస్ఆర్‌పి శ్రీనివాస్‌రెడ్డి :	9704978583
హఫీజ్‌పేట్ డివిజన్ ఎస్ఆర్‌పి ప్రసాద్‌రావు :	9949953935
హుడా కాలనీ ఎస్ఆర్‌పి గంగారెడ్డి :	7995005092
చందానగర్ డివిజన్ ఎస్ఆర్‌పి బాలజీ :	9848260371
మియాపూర్ డివిజన్ ఎస్ఆర్‌పి కనకరాజు :	9866497876

- హఫీజ్‌పేట్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని సాయి ఐశ్వర్య కాలనీలో ముత్యాలమ్మ ఆలయం, శివాలయం తృతీయ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి, శివుడికి అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఆలయ నిర్వాహకులు వేణుగోపాల్, సహదేవ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువు సమీపంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి జులై 3వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం అంకురార్పణ, 28న అగ్ని ప్రతిష్ట ,నిత్య హోమం, గరుడ ధ్వజారోహణ, సంతాన ప్రద ప్రసాద గోష్ఠి, 29న నవకలశ స్నపనం, అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపెడుతూ, పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల పవన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలని పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. పటాన్‌చెరులోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం ఉదయం ఏబీవీపీ నాయకులు చేరుకుని బంద్ చేయించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుంటే ,ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు.ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, బుక్స్, స్టేషనరీ, యూనిఫాం, షూస్ పేర్లతో చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేదల కోసం 25సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాత్విక్, రోహిత్, నిహంత్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా పనులు చేయాలి



సాయినగర్ ఈస్ట్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్ ఈస్ట్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా ముందస్తు ప్రణాళికతో పనులను పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా సాయినగర్ ఈస్ట్ ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్‌గౌడ్, ప్రకాష్, పార్వతీశ్వర్‌రావు, రంగారావు, భాస్కర్, శేఖర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మధురెడ్డి, మోజెస్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కల్వరి టెంపుల్ నుంచి 4వ ఫేజ్ ఎస్‌టీపీ ప్లాంట్ వరకు జరుగుతున్న వాటర్ పైపులైన్ పనులను కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం సంశీద్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

